సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 4 । మే । 2023



వాహన సేవ రద్దు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించాల్సిన పొన్నచెట్టు వాహనం మీద ఊరేగింపు కార్యక్రమాన్ని వర్షం కారణంగా రద్దు చేశారు.



పేద విద్యార్థులకు 'పీఎం యశస్వి'

పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం యశస్వి'పథకాన్ని ప్రవేశ పెట్టింది.

8 లో

రత్నగిరిపై వేదఘోష



రత్నగిరి శ్రీసత్యదేవుని సన్నిధి బుధవారం వేదఘోషతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో సాయంత్రం నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్ల సమక్షంలో వేదపండిత సదస్యం ఘనంగా జరిగింది.

8 లో

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ అవార్డు



మాధవీలత, కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా రెడ్ క్రాస్ శాఖ అధ్యక్షులు, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ప్రతిష్టాత్మక రెడ్ క్రాస్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ బుధవారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు, సామాజిక చైతన్యవంతమైన కార్యక్రమాల అమలు నేపథ్యంలో గవర్నర్ చేతుల మీదుగా ప్రతి ఏటా అవార్డులను ప్రదానం చేస్తారన్నారు. మన జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.40 లక్షల మేర విరాళాల సేకరించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల కలెక్టర్లకు మాత్రమే ఈ గౌరవం దక్కిందన్నారు. విజయవాడలోని గవర్నర్ బంగ్లాలో మే 8వ తేదీన జరిగే కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్ మాధవీలత అవార్డు అందుకుంటారన్నారు. రెడ్ క్రాస్ విభాగం జిల్లా చైర్మన్ వై.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మానవతా స్ఫూర్తి, సేవాభావాన్ని పెంపొందించేలా జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాలు పనిచేస్తున్నాయన్నారు. రూ.18 లక్షలతో నగరంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ భవన నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కాగా.. అవార్డుకు ఎంపికైన కలెక్టర్‌కు జేసీ ఎస్. తేజ్ భరత్, కమిషనర్ కె.దినేష్ కుమార్, డీఆర్వో నరసింహులు, జిల్లా చైర్మన్ వై.మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి, వైస్ చైర్మన్ దాల్ సింగ్ అభినందనలు తెలిపారు.

200 కిలోల గంజాయి పట్టివేత



రాజానగరంలో పట్టుబడిన గంజాయి, నిందితులు

రాజానగరం: జాతీయ రహదారిపై స్థానిక ఉన్నత పాఠశాల సెంటరులో 200 కిలోల గంజాయిని రాజానగరం పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో సంబంధమున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్‌లను స్వాధీనపర్చుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 10 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పైసెంటరులో వాహనాలను సోదా చేస్తుండగా గంజాయి పట్టుబడింది. మినీ లారీలో గంజాయిని బస్తాలుగా వేసి, పైన బరకాలు కప్పి సీలేరు నుంచి రాజమహేంద్రవరం వైపు అక్రమంగా తరలిస్తున్నారు. అదే వాహనంలో గంజాయి రవాణాకు సంబంధించిన ఎనిమిది మంది సాధారణ వ్యక్తులుగా ప్రయాణిస్తున్నారు. ఈ సంఘటనలో ఏడుగురు పోలీసులకు చిక్కగా మరొకరు పరారయ్యాడు. నలుగురు సీలేరుకు చెందిన వారు కాగా వారిలో ఒక మహిళ కూడా ఉన్నారు. మిగిలిన ఇద్దరూ గోకవరానికి చెందిన వారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

అకాల వర్షం.. అతలాకుతలం

- వరుసగా ఐదో రోజు కొనసాగిన ప్రభావం
- 778 హెక్టార్లలో నీట మునిగిన వరి
- నష్టం అంచనాలు రూపొందించిన అధికారులు
- పరిస్థితి ఇలాగే కొనసాగితే వరికి నష్టం



నేలకొరిగిన పంటను చూపుతున్న రైతు



నిడదవోలులో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



సమిశ్రగూడెంలో మొలకెత్తిన వరిని చూపుతున్న రైతు

జిల్లాలో పంట నష్టం ఇలా..

మండలం	వరి కోతలు (శాతం)	పంట ముంపు (హెక్టార్లలో)	తడిసిన ధాన్యం (మె.టన్నుల)
అనపర్తి	84	4	1440
బిక్కవోలు	71	6	610
చాగల్లు	85	10	25
గోపాలపురం	50	10	20
గోకవరం	90	05	10
కడియం	66	44	15
కోరుకొండ	86	12	460
కొవ్వూరు	85	20	1080
నిడదవోలు	70	480	5000
పెరవలి	43	72	1200
ఉండ్రాజవరం	54	120	380

సాక్షి, రాజమహేంద్రవరం: అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. ద్రోణి ప్రభావంతో ఐదు రోజులుగా కురుస్తున్న వాన ఆందోళనకు గురి చేస్తోంది. బలమైన ఈదురుగాలులు గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. వర్షపు నీరుపొలాల్లోకి చేరి పంటలను ముంచుతోంది. రహదారులు జలమయంగా మారుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లో నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీటితో వరి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. ఇప్పటి వరకు కురిసిన వర్షంతో పెద్ద ఇబ్బంది లేకపోయినా.. ఇకపై కూడా ఇలాగే పరిస్థితి కొనసాగితే కోతకు సిద్ధంగా ఉన్న వరికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

791 హెక్టార్లలో నీట మునిగిన వరి

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 53 గ్రామాల పరిధిలో 791 హెక్టార్లలో వివిధ రకాల పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అందులో వరి అత్యధికంగా 778 హెక్టార్లు కాగా.. నువ్వులు 8, మినుములు 4, గింజపోసుకునే దశలో ఉన్న మొక్కజొన్న 1 హెక్టార్‌లో నీటి మునిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిడదవోలు మండలం సమిశ్ర గూడెంలో ధాన్యం మొలకెత్తడంతో ఆందోళన చెందుతున్నారు. గింజ మొలకలు వస్తే తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. వీటితో పాటు ఉద్యానపంటలైన అరటికి తీవ్ర నష్టం జరిగింది. కడియం, కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, నిడదవోలు, గోపాలపురం తదితర గ్రామాల్లో అరటి నేలకొరిగింది.

కళ్లాల్లో కష్టం

జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 38,843 హెక్టార్లలో కోతలు పూర్తయి 71 శాతం నమోదు చేసుకున్నాయి. 3,52,588 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. రాజమండ్రి రూరల్‌లో 96 శాతం కోతలు పూర్తవగా.. రాజానగరంలో 95, అనపర్తిలో 84, గోకవరం 90, కొవ్వూరులో 85 శాతం పూర్తయ్యాయి. కోతలు పూర్తయిన ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోశారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో తడిసి ముద్దయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. సురక్షిత ప్రాంతాలకు ధాన్యం తరలించడంతో తలమునకలవుతున్నారు.

సురక్షిత ప్రాంతాలకు 11,080 మెట్రిక్ టన్నుల పంట

జిల్లాలో 11,080 మెట్రిక్ టన్నుల వరి, మొక్కజొన్న కళ్లాల్లో తడిసినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. అందులో అత్యధికంగా వరి 10,740 మెట్రిక్ టన్నులు కాగా.. మొక్కజొన్న 340 మెట్రిక్ టన్నులు. వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు నేరుగా మిల్లులకు తరలించారు. మిల్లుల్లో అందుబాటులో ఉన్న యంత్రాలతో తేమ శాతాన్ని అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

17.5 మిల్లీ మీటర్ల వర్షం

వరుణుడి ఉగ్రరూపం ఐదో రోజూ జిల్లాలో కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి రాత్రి వరకు కుండపోత వర్షం కురిసింది. జిల్లా సగటు 17.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అనపర్తి, దేవరపల్లిలో 38.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా బిక్కవోలులో 6.2 మిల్లీ మీటర్లు నమోదైంది. ఉండ్రాజవరం, పెరవలిలో చిరుజల్లులు పడ్డాయి. చాగల్లు 33.8, నిడదవోలు 29.4, తాళ్లపూడి 25.2, కడియం 26.2, రాజమండ్రి రూరల్ 23.6, కోరుకొండ 17.4, రాజానగరం 21.6, గోకవరం 11.4, సీతానగరం 14.8, నల్లజెర్ల 8.6, గోపాలపురం 5.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.



పంటను పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

ఆందోళన వద్దు



వర్షాలకు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటికే తడిసిన 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సురక్షితంగా మిల్లులకు తరలించాం. అక్కడ తేమ తగ్గించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎక్కడా కళ్లాల్లో పంట లేదు. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తాం. ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాం. పంట నష్టం, నీటి మునిగిన వివరాలు సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు ఎలాంటి నష్టం లేదు. జిల్లా వ్యాప్తంగా 71 శాతం కోతలు పూర్తయ్యాయి. మిగిలిన 29 శాతం సమయం చూసి చేపట్టాలి.

– కె.మాధవీలత, కలెక్టర్

ఇలాగే కొనసాగితే కష్టం



ఇప్పటి వరకు కురిసిన వర్షంతో ధాన్యం తడిసిపోయి ఉంటుంది. పెద్దగా నష్టం వాటిల్లదు. ఇకపై పరిస్థితి అలాగే కొనసాగితే వరి పంట నేలకొరుగుతుంది. గింజ రాలిపోయి తిరిగి మొలకెత్తే పరిస్థితి తలెత్తుతుంది. అప్పుడు పంట నష్టం తీవ్రంగా ఉంటుంది.

– ఎస్.మాధవరావు, వ్యవసాయ అధికారి

ఏ నెలలో ఏయే సంక్షేమ పథకాలంటే..

క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి వనిత



కొవ్వూరులో సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: దేశంలో ఎక్కడాలేనన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. అంతేగాకుండా ఏ నెలలో ఏయే పథకం ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుస్తామన్న వివరాలతో కూడిన సంక్షేమ క్యాలెండర్‌ను కూడా విడుదల చేయడం చారిత్రక అధ్యాయం అని ఆమె పేర్కొన్నారు. కొవ్వూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం మంత్రి వనిత 2023–24 సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 45 నెలల్లోనే వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2,96,148.09 కోట్ల మేర రాష్ట్రంలోని పేదలకు లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఏటా ఏప్రిల్‌లో వసతి దీవెన, వైఎస్సార్ ఈబీసీ నేస్తం (రెండో ఏడాది) అందించారన్నారు. మే నెలలో వలంటీర్లకు వందనం, వైఎస్సార్ రైతు భరోసా, సీఎం కిసాన్, ఉచిత పంటల బీమా, వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా, వైఎస్సార్ మత్స్యకార భరోసా అందించనున్నామన్నారు. జూన్‌లో జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, వైఎస్సార్ లా నేస్తం, మే నెల వరకూ అమలైన పథకాలకు అర్హులై ఉండి మిగిలిపోయిన వారికి లబ్ధి చేకూరుస్తామన్నారు. జూలైలో జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్‌ఈలకు ప్రోత్సాహకాలు, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా అందిస్తారన్నారు. ఆగస్టులో జగనన్న విద్యా దీవెన, కాపు నేస్తం, వైఎస్సార్ వాహన మిత్ర, సెప్టెంబర్‌లో వైఎస్సార్ చేయూత, అక్టోబర్‌లో వైఎస్సార్ రైతుభరోసా, జగనన్న వసతి దీవెన సాయం అందిస్తారన్నారు. ఇక నవంబర్‌లో వైఎస్సార్ సున్నా వడ్డీ, పంట రుణాలు, వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా, జగనన్న విద్యా దీవెన, డిసెంబర్‌లో జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న చేదోడు, జూన్ నుంచి నవంబర్ వరకూ అమలు చేసిన పథకాల్లో మిగిలిపోయిన అర్హులకు లబ్ధి చేకూరుస్తారని మంత్రి వనిత వివరించారు. ఇక 2024 జనవరిలో వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్, వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, వైఎస్సార్ లా నేస్తం, వైఎస్సార్ పింఛను కానుక, ఫిబ్రవరిలో జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, మార్చిలో జగనన్న వసతి దీవెన, ఎంఎస్‌ఈలకు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు మంత్రి వివరించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచేనాటికి జేవీకే కిట్లు సిద్ధం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజమహేంద్రవరం అర్బన్ మండలానికి సంబంధించిన విద్యాకానుక కిట్స్ స్టోరేజ్ పాయింట్‌ను బుధవారం విద్యాశాఖ అధికారులతో కలసి ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరంలో 1,21,735 మంది విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తామన్నారు. 1.24 లక్షల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 70,654 పుస్తకాలు వచ్చాయన్నారు. స్టోరేజ్ పాయింట్లకు చేరుకున్న మెటీరియల్‌ను సమగ్రంగా పరిశీలించి విద్యాశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమెవెంట డీఈవో ఎస్.అబ్రహం, అర్బన్ రేంజ్ ఉప విద్యాఅధికారి బి.దిలీప్ కుమార్, సమగ్ర శిక్ష సీఎంఓ శ్రీనివాస్, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎంవీఎం.సుబ్రహ్మణ్యం, సీఆర్పీలు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు ఉన్నారు.

గడపగడపకూ గోదారి

- రాజానగరం నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- రూ. 215 కోట్ల వ్యయంతో పథకం రూపకల్పన
- తాజాగా లభించిన పరిపాలనానుమతులు
- ఎన్నికల హామీ నెరవేర్చుతున్న ఎమ్మెల్యే రాజా



ముక్కినాడలో నిర్మిస్తున్న ఓహెచ్ఆర్ (ఫైల్)



సంపత్‌నగరంలో నిర్మించిన ఓహెచ్ఆర్

రాజానగరం: రాజానగరం నియోజకవర్గంలో దాహార్తి తీర్చేందుకు ఇంటింటికీ కుళాయిల ద్వారా గోదావరి జలాలను అందిస్తానంటూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇచ్చిన హామీ నెరవేరనుంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ పాలనానుమతులను మంజూరు చేయడంతో మార్గం సుగమమైంది. గోదావరి సమీపాన ఉన్నా ఈ నియోజకవర్గంలో తాగునీటికి భూగర్భ జలాలే ఆధారం. సీతానగరం మండలం చాలావరకు ఏటిపట్టున ఉన్నా, కోరుకొండ, రాజానగరం మండలాలు పూర్తిగా మెట్ట ప్రాంతంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో తనను గెలిపిస్తే, నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా గోదావరి జలాలను అందిస్తానని వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిలిచిన జక్కంపూడి రాజా హామీ ఇచ్చారు. గత నాయకుల మాదిరిగా హామీలను విస్మరించకుండా పట్టు వదలని విక్రమార్కునిగా అడుగులు వేశారు. నాడు తండ్రి రామ్మోహనరావు తరహాలోనే ఇచ్చిన మాటకు కట్టుబడి నీటిని అందించనున్నారు.

రూ. 215 కోట్ల వ్యయం

నియోజకవర్గానికి గోదావరి జలాలను అందించే బృహత్ ప్రణాళికను జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.215 కోట్లతో చేపట్టేందుకు ఈనెల 1న పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఈ పథకం ద్వారా రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాలలోని 93 నివాసిత ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా శుద్ధిచేసిన గోదావరి జలాలను అందిస్తారు. ఇందుకు సంబంధించిన పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఓహెచ్ఆర్‌లను నిర్మిస్తున్నారు.

పురుషోత్తపట్నం వద్ద ప్రధాన లిఫ్టు

సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద ప్రధాన లిఫ్టు నుంచి గోదావరిలోని నీటిని మోటార్ల సాయంతో తోడి, అక్కడనే శుద్ధి చేస్తారు. 3.5 లక్షల సామర్థ్యంతో కూడిన సంప్‌లో నీటిని నిల్వ చేస్తారు. అక్కడే వంద అడుగుల ఎత్తులో నిర్మించిన 7 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి సంప్ నీటిని పంపిస్తారు. మోటార్ల ద్వారా నీటిని సీతానగరం మండలంలోని 32 గ్రామాలకు 83 కి.మీ. వరకు వేసే పైపులైన్ల ద్వారా ఓహెచ్ఆర్‌లకు పంప్ చేస్తారు. అక్కడ నుంచి కుళాయిల ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా జరుగుతుంది.

▸▸ కోరుకొండ మండలంలోని 22 గ్రామాలకు కోరుకొండలో 1.30లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటుచేసిన సంప్‌నకు పురుషోత్తపట్నం లిఫ్టు నుంచి నీటిని పంప్ చేస్తారు. అక్కడ నుంచి ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి పంపిస్తారు. మండలంలో 82 కి.మీ. మేర నీటిని సరఫరా చేస్తారు.

▸▸ పురుషోత్తపట్నం ప్రధాన లిఫ్టు నుంచి గోదావరి జలాలు రాజానగరం మండలం చక్రద్వారబంధం, రాధేయపాలెం వద్ద రెండు సంప్‌లకు వస్తాయి. అక్కడ నుంచి చక్రద్వారబంధంలో 1.5 లక్షల లీటర్లు, రాదేయపాలెంలో 1.4 లక్షల లీటర్లు సామర్థ్యంతో నిర్మించిన సంప్‌లకు ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి పంపిస్తారు. అక్కడ నుంచి మండలంలోని 39 గ్రామాలకు గోదావరి జలాలను సరఫరా చేస్తారు.

సీఎం సహకారంతోనే సాధ్యం



గోదావరి జలాల సరఫరాపై ఇచ్చిన మాటను నెరవేర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం, సహకారాలే తోడ్పడుతున్నాయి. జలజీవన్ మిషన్ పథకంలో రూ. 215 కోట్లు నిధులు మంజూరు చేసి, పరిపాలనా ఆమోదం తెలిపిన సీఎంకి కృతజ్ఞతలు. గతంలో నాన్న (జక్కంపూడి రామ్మోహనరావు) కూడా తాగునీటి సమస్య పరిష్కారానికి వేమగిరి కొండపై ప్రత్యేక పథకాన్ని ఏర్పాటుచేశారు. ఆయన స్ఫూర్తితోనే ఇంటింటికీ గోదావరి జలాలు అందిస్తానని ప్రజలకు నాడు మాటిచ్చి నెరవేర్చగలుగుతున్నాం.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే

90 శాతం పనులు పూర్తయ్యాయి



జలజీవన్ మిషన్ పథకం పనులు 90 వరకు పూర్తయ్యాయి. 93 నివాసిత ప్రాంతాలలో మనిషికి రోజుకు 55 లీటర్లు నీరు అవసరమని భావించి ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏ గ్రామంలోనూ నీటి ఎద్దడి ఉండదు.

– రవికుమార్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్,

క్లుప్తంగా

మారుతీ 'ఫ్రాంక్స్' మార్కెట్‌లోకి విడుదల



మార్కెట్‌లోకి ఫ్రాంక్స్ కారును విడుదల చేసిన భాస్కర్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: మారుతీ కొత్తగా ఉత్పత్తి చేసిన స్పోర్టీలుక్ కంపాక్ట్ ఎస్‌యూవీ కార్ ×ఫ్రాంక్స్×ను రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్, ఆడిటర్ ఏకేఎస్ భాస్కర్‌రామ్ బుధవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమీపంలోని నెక్స్ మారుతీ డీలర్ ఎస్‌బీమోటార్స్‌లో జరిగిన కార్యక్రమంలో భాస్కర్‌రామ్ ఫ్రాంక్స్‌ను తూర్పుగోదావరి జిల్లా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీ గ్రూప్ ఎండి ఎం.రంగప్రసాద్ మాట్లాడుతూ ఫ్రాంక్స్ ఒక లీటర్ టర్బోభూస్టర్ జెట్, 1.2లీ జ్యూయల్‌జెట్ వేరియంట్లలో లభిస్తుందన్నారు. 360 డిగ్రీ కెమెరా, హెడ్‌ఆఫ్ డిస్‌ప్లే వంటి ఎన్నో ఆధునిక సౌకర్యాలు ఇందులో ఉన్నాయన్నారు. పెట్రోల్‌కి వేరియంట్‌ని బట్టి 20–23 కిలోమీటర్ల మైలేజ్ వస్తుందన్నారు. ఎస్‌బీ గ్రూప్ డైరెక్టర్ ఎం.సురేష్‌కుమార్, లంకపల్లి శ్రీనివాసరావు, నెక్స్‌సేల్స్ జీఎం పి.దేవీవరప్రసాద్, మారుతీ సేల్స్ జీఎం ఎంవిఎస్ఆర్.గుప్తా పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

కాకినాడ లీగల్: భార్య, కుమార్తెపై కత్తితో దాడి చేసిన కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ.ఆరు వేల జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.వి.ఎస్. పద్మజ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన మట్టి ఉమాశంకర్ రోజు మద్యం తాగడంతోపాటు, ఇతర వ్యసనాలకు బానిసై ఇంట్లో వస్తువులు అమ్మేసేవాడు. భార్య మట్టి దుర్గకు సంబంధించిన స్థలాన్ని అమ్మి డబ్బులు ఇవ్వాలని గొడవ పెట్టేవాడు. ఈ నేపథ్యంలో భార్య, కుమార్తెపై కత్తితో 2002 జూలై 25వ తేదీన దాడి చేశాడు. దీనిపై భార్య దుర్గ టూటౌన్ పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో ఉమాశంకర్ పై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు, రూ.ఆరు వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ డానియల్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పేద విద్యార్థులకు 'పీఎం యశస్వి'

- కేంద్ర ప్రభుత్వ వినూత్న ఉపకార వేతన పథకం
- ఆగస్టు 26 వరకు దరఖాస్తుకు అవకాశం



రాయవరం: పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం యశస్వి'పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఆర్థికంగా వెనుకబాటుతనం ఉన్నవారి కలలను ఈ పథకం ద్వారా నెరవేర్చుకునే వీలుంది. ప్రతిభ ఉండి నిస్సహాయ పరిస్థితుల్లో చదువును మధ్యలో ఆపేసి ఉపాధి బాట పట్టే వారి కోసం కేంద్ర ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి 'పీఎం యశస్వి' పేరుతో గతేడాది రూపకల్పన చేసింది. యశస్వి అంటే 'యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా'. ఇప్పటి వరకు ఉన్న అతి పెద్ద ఉపకార వేతన పథకాల్లో 'పీఎం యశస్వి' కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయ, సాధికారిక మంత్రిత్వ శాఖ పరిధిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పథకానికి ఆధ్వర్యం వహిస్తోంది.

అర్హులు ఎవరంటే..

- కేంద్ర విద్యాశాఖ అధికారి ఎన్‌టీ ఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.
- ప్రవేశ పరీక్ష రాసేందుకు 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి.
- 9,10 తరగతులు పూర్తయిన వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి మిగిలిన సంవత్సరాలకు (ఇంటర్ వరకు) మాత్రమే స్కాలర్ షిప్ లభిస్తుంది.
- ఓబీసీ, ఈబీసీ తరగతులకు చెందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. – 9వ తరగతిలో దరఖాస్తు చేసుకునే వారు 2004 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2008 మార్చి 31లోపు జన్మించి ఉండాలి.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించి ఉండరాదు.


గ్రామాల్లోని నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాల్లోని విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు.

దరఖాస్తు ఇలా..

ప్రవేశ పరీక్ష రాయడానికి ఎన్‌టీ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి. పేరు, ఈ–మెయిల్ అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితరాలతో ఓ ఖాతాను క్రియేట్ చేసుకోవాలి. తర్వాత దరఖాస్తుదారునికి అప్లికేషన్ నంబరు వస్తుంది. అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. చదువు, గుర్తింపు కార్డు తదితర వివరాల డాక్యుమెంట్ల సాఫ్ట్ కాపీలను అప్‌లోడ్ చేసి సైన్ అప్ కావాలి. అంతటితో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. పరీక్ష, ప్రవేశ కార్డు జారీ చేసే తేదీ తదితర వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చు.

పరీక్ష నిర్వహిస్తారిలా

మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు కొనసాగే పరీక్షలను హిందీ, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహిస్తారు. ప్రవేశ రుసుం లేదు. 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. గణితంలో 120 మార్కులకు 30 ప్రశ్నలు, సైన్సులో 80 మార్కులకు 20 ప్రశ్నలు, సోషల్‌లో 100 మార్కులకు 25 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్‌లో 100 మార్కులకు మరో 25 ప్రశ్నలుంటాయి. దేశవ్యాప్తంగా 78 ప్రధాన నగరాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. గతేడాది సెప్టెంబరు 11న ఈ పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 15 నుంచి ఈ ఏడాది నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, ఆగస్టు 26తో దరఖాస్తు ప్రక్రియ పూర్తికానుంది.



పీఎం యశస్వి లోగో

ఉపకార వేతనం ఎంత?

9, 10 తరగతులకు ఏటా రూ.75 వేలు, ఇంటర్మీడియెట్ లేదా 11,12 తరగతులకు ఏటా రూ.1.25 లక్షలు ఉపకార వేతనం ఒకేసారి అందిస్తారు.

అర్హత సాధించిన తర్వాత..

విద్యార్థులు మళ్లీ ఉపకార వేతనం కోసం అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏ బ్యాంకు ద్వారా పొందాలనుకుంటారో ఆ బ్యాంకు పాస్ పుస్తకం ఫొటో కాపీని జత చేయాలి. ఉపకార వేతనం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. వీటితో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాలలో అయినా విద్యార్థులు విద్యనభ్యసించవచ్చు.

రూ.10 లక్షల కోట్ల వ్యాపారం అధిగమించాం

- ఇండియన్ బ్యాంక్ దివాన్ చెరువు 65వ శాఖ ప్రారంభం
- ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేష్ రామన్



దివాన్ చెరువు శాఖను ప్రారంభిస్తున్న జీఎం గణేష్ రామన్

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ బ్యాంక్ రూ.10 లక్షల కోట్ల వ్యాపారాన్ని అధిగమించిందని ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేష్ రామన్ పేర్కొన్నారు. బుధవారం ఇండియన్ బ్యాంక్ 56వ శాఖగా లాలాచెరువులో ఏర్పాటు చేసిన దివాన్ చెరువు శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు కోరుకున్న కొత్త పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. స్వంత ఇంటి కల నెరవేర్చేందుకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నామన్నారు. జోనల్ మేనేజర్ సుధాకరరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం జోన్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత ఐదు జిల్లాల్లో 65వ శాఖగా లాలాచెరువు బ్రాంచి ప్రారంభోత్సవం జరిగిందన్నారు. జోన్ రూ.7,819 కోట్ల వ్యాపారం సాగిస్తున్నామన్నారు. ఎస్‌హెజీసీ గ్రూపులకు రూ.250 కోట్లు రుణాలు అందజేశామన్నారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీలకు రూ.135 కోట్లు, వ్యవసాయరంగానికి రూ.616 కోట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎం దుర్గావరాహ ప్రసాద్ పాల్గొన్నారు.

దేవస్థానం సూపరింటెండెంట్ నగేష్ ఇళ్లపై ఏసీబీ దాడులు



ద్వారకాతిరుమలలో నగేష్ అపార్ట్‌మెంట్

- ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో సోదాలు
- పలు విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం



ద్వారకాతిరుమలలోని నగేష్ అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు



నిడదవోలులో సురేష్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

ద్వారకాతిరుమల: స్థానిక వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం నుంచి, విజయవాడ దుర్గ గుడికి 2022 జులై 1న బదిలీపై వెళ్లిన సూపరింటెండెంట్ వాసా నగేష్ ఇళ్లపై ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం దాడి చేశారు. పలు ప్రాంతాల్లోని ఆయన బంధువుల ఇళ్లపై సైతం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. నగేష్ ఆదాయానికి మించి అక్రమంగా ఆస్తులు కూడబెట్టాడన్న సమాచారంతో ఏసీబీ అధికారులు ఏలూరు జిల్లా భీమడోలులోని అతని బంధువుల ఇళ్లల్లో, ద్వారకాతిరుమలలో నగేష్‌కు చెందిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర అపార్ట్‌మెంట్, విజయవాడ భవానీపురంలో అద్దెకుంటున్న లోటస్ లెజెండ్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంతో విలువైన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. కాగా ద్వారకాతిరుమలలోని అపార్ట్‌మెంట్‌లో ఏలూరు ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించిన ఏసీబీ సీఐ, ఎస్సై, సిబ్బంది అపార్ట్‌మెంట్ విస్తీర్ణం ఎంత, విలువ ఎంత, దాన్ని ఎప్పుడు నిర్మించారు వంటి వివరాలను సేకరించారు. అనంతరం స్థానిక కెనరా, యూనియన్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుల్లోని అకౌంట్లను, లాకర్లను తనిఖీ చేశారు.

నిడదవోలులోనూ తనిఖీలు

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో సూపరింటెండెంట్ వాసా నగేష్ సోదరుడు, దస్తావేజుల లేఖరి వాసా సురేష్ ఇంట్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు దస్తావేజులు, భూములకు సంబంధించి పలు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదే సమయంలో వాసా సురేష్ ఆస్తులకు సంబంధించిన పలు వివరాలను ఏసీబీ అధికారులకు చెప్పారు. రాజమహేంద్రవరం ఏసీబీ సీఐ సతీష్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల బృందం ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏసీబీ సీఐ సతీష్ మాట్లాడుతూ సూపరింటెండెంట్ వాసా నగేష్‌కు సంబంధించిన పలు ఆస్తులు, దస్తావేజులను పరిశీలించామని, వాటి వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.



వాసా నగేష్ (ఫైల్)

రత్నగిరిపై వేదఘోష



సదస్యంలో వేద మంత్రాలు పఠిస్తున్న పండితులు

అన్నవరం : రత్నగిరి శ్రీసత్యదేవుని సన్నిధి బుధవారం వేదఘోషతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో సాయంత్రం నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్ల సమక్షంలో వేదపండిత సదస్యం ఘనంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వేద, స్మార్త పండితులు స్వామివారి ముందు తమ వేద విద్వత్తును ప్రదర్శించారు. ఈ సందర్భంగా 150 మంది పండితులను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు సత్కరించారు. మధ్యాహ్నం మూడు గంటలకు నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పెళ్లిపెద్దలు సీతారాములు వెంట రాగా నిత్య కల్యాణ మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి అక్కడి వేదిక మీద ప్రతిష్ఠించారు. అనంతరం స్వామి అమ్మవార్లను సర్వాంగసుందరంగా అలంకరించి పూజలు చేసిన తరువాత పండిత సదస్యాన్ని ప్రారంభించారు. సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణం పండితుల వేద మంత్రాలతో మార్మోగింది. పండితులు స్వామివారి ముందు నాలుగు వేదాలు పఠించారు. తరువాత దేవస్థానం వేదపండితులు సత్యదేవుడు, అమ్మవార్లకు వేదాశీస్సులందజేశారు.

పండిత సత్కారం

అనంతరం వేద పండితులను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు ఘనంగా సత్కరించారు. తొలుత ప్రముఖ పండితులు మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, గుళ్లపల్లి శ్రీరామచంద్ర ఘనాపాఠీ, చిర్రావూరి శ్రీరామశర్మ, తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు కె.సోమయాజీలను నగదు కానుక, స్వామివారి ప్రసాదం, మామిడిపండ్లతో సత్కరించారు. తరువాత మిగిలిన పండితులను సత్కరించారు. దేవస్థానం విశ్రాంత వేదపండితులు ముష్టి కామశాస్త్రి, విశ్రాంతి ప్రధానార్చకులు నాగాభట్ల సత్యనారాయణ, విశ్రాంత వ్రత పురోహిత సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వరశర్మ, విశ్రాంత వ్రతపురోహితులను కూడా సత్కరించారు. వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట శ్రీనివాస్, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్, అర్చకస్వాములు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, సుధీర్, ముత్య వేంకట్రావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



రాజమహేంద్రవరం రూరల్/రాజానగరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన 55 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిందని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై జగన్‌మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 27వ తేదీన ఆటోనగర్ టయోటా షోరూమ్ సమీపంలో నేషనల్‌హైవేపై స్కూటీ నడుపుతున్న వ్యక్తి అతివేగంగా మహిళను ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని మహిళ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. స్కూటీ నడుపుతున్న వ్యక్తి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతిచెందిన మహిళ వివరాలు ఎవరికైనా తెలిస్తే బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ సెల్ నంబర్ 94407 96533 కు తెలపాలని ఎస్సై కోరారు.